క్లుప్తంగా

రోడ్ల నిర్మాణానికి సహకరించండి

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలోని పలు వీధుల్లో సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, సీఎస్ఆర్ నిధులు కేటాయించి రోడ్లు నిర్మించాలని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, తదితరులు హెటిరో కంపెనీ యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు కంపెనీ డీజీఎం సుబ్బారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. నక్కపల్లిలో రాజా వీధి, కొత్తపేట, ఆర్టీసీ కాంప్లెక్స్ వీధి, టీచర్స్ కాలనీ వీధుల్లో సరైన రోడ్లు లేవన్నారు. పంచాయతీ నిధులు కొరత కారణంగా కంపెనీ సీఎస్ఆర్ నిధులు మంజూరు చేసి రోడ్ల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అల్లాడ కొండ, జి.బంగారాజు, తదితరులు పాల్గొన్నారు.

దర్జీలకు ప్రోత్సాహం అవసరం

మునగపాక: దర్జీలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించి ఆదుకోవాలని దర్జీల సంఘం అధ్యక్షుడు ఆళ్ల వెంకటరావు కోరారు. మండలంలోని గవర్ల అనకాపల్లిలో శుక్రవారం ప్రపంచ టైలర్స్ డే సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్జీలకు పూర్వ వైభవం రావాలన్నారు. ఎంతో మంది దర్జీలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మద్దాల నాగప్పారావు, సభ్యులు పెంటకోట శివాజీ, అప్పికొండ శివ, కాండ్రేగుల వెంకటలక్ష్మి, పాల మరశెట్టి శారదా, అంగులూరి శ్రీనివాస్, ద్రాక్షారపు రామకృష్ణ, వానపల్లి వెంకటప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజన' నిర్వాహకులకు మెమో



మెమో జారీ చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి శుక్రవారం మెమో జారీ చేశారు. ఇక్కడ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వంట చేయకపోవడంతో తనకు వివరణ ఇవ్వాలంటూ మెమో జారీ చేసినట్లు ఆమె తెలిపారు. శుక్రవారం పదో తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులకు సరిపడా భోజనం లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి ఫిర్యాదులు వచ్చినా నిర్వాహకుల్లో మార్పు రాలేదని, ఇకపై ఎలాంటి తప్పులు జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

క్షయ నివారణకు కృషి చేయాలి



క్షయ నివారణపై చర్చిస్తున్న వైద్యులు

అచ్యుతాపురం రూరల్ : క్షయ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎయిడ్స్, లెప్రసి, టీబీ(డీఎల్ఏటీఓ) వైద్యుడు ఎం.ఎస్.వి.కె.బాలాజీ కోరారు. ప్రధానమంత్రి టీబీ ముక్త పంచాయతీలుగా మండలంలో పీహెచ్‌సీ పరిధిలో మార్టూరు, రామన్నపాలెం, ఖాజీపాలెం పంచాయతీలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్షయ లక్షణాలు ఉన్న వారు ముందుగా వైద్యులను సంప్రదించి మందులు వాడితే వ్యాధి నయం చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు వి.కనకఅప్పారావు, వైద్యాధికారి కె.శ్రావ్య, పంచాయతీ కార్యదర్శులు, సీహెచ్‌వో కె.వేణుగోపాల్, డీపీఎస్ రామకృష్ణ, ఎస్‌టీఎస్ ఏవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

పశు పక్ష్యాదులకూ అంత్యక్రియలు చేయాలి



పశుపక్ష్యాదుల సంస్కార వాటికపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో జయమాధురి

రాంబిల్లి(యలమంచిలి): మనుషుల వలే పశు పక్ష్యాదులకు కూడా అంత్యక్రియలు చేయడం, భూమిలో పాతపెట్టడం అనేది మంచి కార్యక్రమమని ఎంపీడీవో జయమాధురి అన్నారు. హరిపాలెంలో పశుపక్ష్యాదుల సంస్కర వాటికపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో పశుపక్ష్యాదులు మరణిస్తే జనవాసాలకు దూరంగా ఓ స్థలంలో గుంత తవ్వి బ్లీచింగ్, ఉప్పు వంటి వాటిని వేసి పూడ్చిపెట్టాలని పారిశుద్ధ్య కార్మికులకు, క్లాప్ మిత్రలకు సూచించారు. దీనిపై మండలంలో అన్ని గ్రామాల పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది, వీఆర్పీలకు ప్రయోగాత్మకంగా వివరించారు.

చిట్టి చేతులు.. అద్భుత ఆవిష్కరణలు

- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం
- పాఠశాలల్లో ఆకట్టుకున్న నమూనాలు



బోదిగళ్లం స్కూల్‌లో మైక్రోస్కోప్‌తో పరీక్ష చేస్తున్న విద్యార్థి



పెదరాంభద్రపురంలో వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకిస్తున్న ఉపాధ్యాయులు



తిమ్మరాజుపేటలో రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కైట్స్ స్కూల్‌లో ప్రదర్శనలు తిలకిస్తున్న అతిథులు

నక్కపల్లి: చిట్టి బుర్రలు అద్భుతాలు సృష్టించాయి. మన చుట్టూ ఉన్న సమస్యలే వారిని ఆలోచింపజేశాయి. వాటికి పరిష్కార మార్గాలను చూపించేలా ఆవిష్కరణల వైపు నడిపించాయి. పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి మండలంలో వేంపాడు, నక్కపల్లి, ఉద్దడపురం, పెద బోదిగళ్లం, దేవవరం, తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బోదిగళ్లంలో సీవీ రామన్ చిత్ర పటానికి ప్రధానోపాధ్యాయుడు చోడిశెట్టి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు.

పాయకరావుపేట: పెదరాంభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను ప్రధానోపాధ్యాయుడు కోడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎల్.గంగునాయుడు, ఎస్‌పీఎం అప్పారావు సందర్శించారు. రాకెట్ నమూనా, సౌరశక్తితో నీటి పారుదల, వాటర్ కూలర్, వాటర్ అలారం, హోలోగ్రాం, ఇమేజెస్, హైడ్రాలిక్ వేయింగ్ మెషిన్, ట్రాఫిక్ సిగ్నల్స్, తదితర నమూనాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. అంతకు ముందు రామన్ చిత్ర పటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.రవికృష్ణ, ఐ.శివాజీరావు, ఆర్.దుర్గాభవాని, షేక్ రహమాన్, వై.శ్రీనివాసరావు, ఆర్.చిరంజీవి, వై.రత్నకుమారి పాల్గొన్నారు.

అచ్యుతాపురం: మండలంలోని కైట్స్ స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ నమూనాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డీఎస్పీ బి.అప్పారావు మాట్లాడుతూ శాస్త్రం మానవ జీవితాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. బార్క్ శాస్త్రవేత్త ఎం.వి.సూర్యనారాయణ మాట్లాడుతూ భవిష్యత్‌లో భారతదేశం శాస్త్ర రంగంలో ఎదగాలని ఆకాంక్షించారు. సెట్విస్ సీఈవో ఎం.సత్యపద్మ మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రదర్శనలో భాగంగా రోబోటిక్స్, పర్యావరణ పరిరక్షణ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి అంశాలతో కూడిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

మునగపాక: మండల వ్యాప్తంగా శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. తిమ్మరాజుపేట హైస్కూల్‌లో సీవీ రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు ప్రయోగాలను ఎంఈవో వేణుగోపాలరావు సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గాలి అప్పారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. నాగులాపల్లి, తోటాడ, వాడ్రాపల్లి, మునగపాక, తదితర పాఠశాలల్లో కూడా రామన్‌కు ఘనంగా నివాళులర్పించారు.

ఆవిష్కరణ, సృజనాత్మకత విద్యార్థులకు అసలైన సంపద



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విజయ్ విట్టల్

పాయకరావుపేట: మనిషి జీవితంలో అసలు సంపద అనేది ఆవిష్కరణ, సృజనాత్మకత మీద ఆధారపడి ఉంటుందని హైదరాబాద్‌కు చెందిన క్రామ్సన్ రీసెర్చ్ పార్కు ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ విట్టల్ టి.మథాడ్ అన్నారు. స్పెసెస్ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయనతోపాటు గౌరవ అతిథిగా ఏయూ డిపార్టుమెంట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కె.వి. రమేష్ హాజరయ్యారు. విజయ్ విట్టల్ మాట్లాడుతూ విజయాన్ని పొందాలంటే ప్రతి ఒక్కరూ బుద్ధి, బలం, యశస్సు, ధైర్యం, నిర్భయత్వం, వృద్ధి, చురుకుతనం, వాక్చాతుర్యం అనే 8 విషయాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రొఫెసర్ రమేష్ మాట్లాడుతూ విజేతలు కావాలంటే పరిశీలనా నైపుణ్యాలు అవసరమన్నారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల నుంచి హాజరైన 300 మంది విద్యార్థుల మధ్య పోస్టర్ ప్రజెంటేషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, క్విజ్, సైన్స్ ప్రాజెక్టులు తదితర అంశాలపై విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహరావు, ప్రిన్సిపాల్ డాక్టరు ఎ.రామకృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా



మునగపాక పీఏసీఎస్‌లో ఎరువుల కోసం పేర్లను నమోదు చేసుకుంటున్న రైతులు

మునగపాక: సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి తెలిపారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు రాయితీపై ఎరువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి ఎరువులను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మోతాదుకు మించి ఎరువులను వినియోగించరాదన్నారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించి వ్యవసాయంలో రాణించాలని ఆకాంక్షించారు. రైతులు ఆధార్ కార్డు జెరాక్స్ తీసుకువచ్చి యూరియాను తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సీఈవో ఆడారి వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీ, అమ్మకం నేరం



ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది, గ్రామస్తులు

పాయకరావుపేట: నాటుసారా తయారు చేయడం, అమ్మకం చేయడం నేరమని విశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.అరుణకుమారి అన్నారు. నాటు సారా రహిత ఆంధ్రప్రదేశ్ నవోదయ 2.0లో భాగంగా శుక్రవారం మండలంలోని గుంటపల్లి, గోపాలపట్నం, వెంకటనగరం, రాజావరం గ్రామాల్లో ప్రజలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. నాటు సారా తాగితే అనారోగ్య పాలవుతారని ఆమె హెచ్చరించారు. నాటుసారా తయారు చేసినా, అమ్మినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు, సిబ్బంది రమణ, నాయుడు పాల్గొన్నారు.

'ఆ భూములను 22ఏ నుంచి తొలగించాలి'



నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి సర్వే నంబర్ 237/2లో ఉన్న భూములు దేవదాయ శాఖకు చెందినవిగా తప్పుగా నమోదై 22ఏ చేర్చారని, దీని వల్ల చాలా మంది ఇబ్బంది పడుతున్నారని నక్కపల్లి వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఉపమాక ఎంపీటీసీ కొల్నాటి బుజ్జి అన్నారు. ఈ మేరకు ఆ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ శుక్రవారం సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ భూములను నక్కపల్లికి చెందిన పలువురు చాలా ఏళ్ల నుంచి క్రయ విక్రయాలు జరుపుకొంటున్నారని వారు తెలిపారు. నక్కపల్లిలో ఉపమాక దేవస్థానానికి ఎకరం భూమి ఉందని, దాన్ని ఆనుకుని ఈ సర్వే నంబరు 237లో భూములు ఉండడంతో దేవదాయ శాఖ భూమిగా 22ఏలో చేర్చి క్రయ, విక్రయాలు నిలిపి వేశారన్నారు. దీనిపై చాలా సార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని నానాజీ తెలిపారు. తక్షణమే విచారణ చేపట్టి ఆ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని కోరారు. ఉపమాక సర్వే నంబరు 112లో ఇదే సమస్య ఉందని, దీన్ని కూడా పరిష్కరించాలన్నారు.

సేంద్రియ పద్ధతిలో సాగు మేలు



సమావేశంలో సలహాలు స్వీకరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

మునగపాక: ఎటువంటి రసాయనాలు వినియోగించకుండా సేంద్రియ పద్ధతిలో పంటల సాగు మేలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ ఫార్మింగ్‌పై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలకు రసాయనాలు వినియోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. మండలంలోని ఓ గ్రామాన్ని ఎంపిక చేసుకుని శత శాతం ఫలితాలు వచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఇందు కోసం రైతులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సీహెచ్.లచ్చన్న, మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి, ఏపీఎం బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

కూటమివి 'సూపర్' మోసాలు

- హామీలపై బడ్జెట్‌లో చేతులెత్తేశారు
- మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు



కంబాల జోగులు

నక్కపల్లి: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు సూపర్ మోసాలని, అవి సూపర్ సిక్సులు కాదని తాజా బడ్జెట్‌లో నిర్ధారణ అయిందని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు విమర్శించారు. శుక్రవారం ఆయన రాష్ట్ర బడ్జెట్‌పై మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికలలో గెలవడం కోసం మోసపూరిత హామీలు ఇచ్చారన్నారు. ఒక్కటి కూడా అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచేశారన్నారు. 50 ఏళ్లు దాటిన బీసీ, ఎస్సీ వర్గాల వారికి రూ.4 వేలు పెన్షన్, మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఇస్తామని హామీలు ఇచ్చి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. వ్యవసాయం, ఇరిగేషన్, విద్యా వైద్య రంగాలకు మొక్కుబడిగా నిధులు కేటాయించారన్నారు. ఈ ప్రభుత్వం ఏంచేస్తుందో చెప్పకుండా గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం లక్ష్యంగా బడ్జెట్ ప్రసంగం ఉందని దుయ్యబట్టారు. ప్రతి మంగళవారం తెచ్చిన అప్పులు ఏం చేశారో, దేని కోసం ఖర్చు చేశారో ఇప్పటి వరకు బయటకు చెప్పడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లో రూ.లక్ష కోట్లు అప్పు తెచ్చారని విమర్శించారు. ఖజానాలో డబ్బంతా అమరావతిలో అభివృద్ధికే కేటాయిస్తున్నారని ఆరోపించారు. గతంలో టీడీపీ హయాంలో ఇలాగే పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే టీడీపీ నాయకులు దోచేశారన్నారు. ఈ ఐదేళ్లు దోచుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలకు కేటాయించిన నిధులు సరిపోవన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ఊసేలేదని విమర్శించారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు అందడం లేదని ఆరోపించారు. రోగులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వానికి పట్టలేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను పరీక్షలు రాయనీయమని బెదిరిస్తున్నాయన్నారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ టెస్ట్



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎస్ఎఫ్ఐ సభ్యులు

పాయకరావుపేట: పట్టణంలో ఉన్న వివిధ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవార మోడల్ టెస్ట్ నిర్వహించారు. గరల్స్ హైస్కూల్‌లో జరిగిన ఈ పరీక్షకు ప్రతిభ కనబరిచిన పది మంది విద్యార్థులకు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎస్ఐ సన్యాసిరావు, హెచ్ఎం డి.ఎ స్.భవాని, కార్తికేయ కాలేజ్ ప్రిన్సిపాల్ గోవింద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్దు, కృప, లక్ష్మణ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

మునగపాక: మూలపేటలో శనివారం అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దుద్దుకూరి మోహనరావు, ప్రకాశరావు ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు చేయనున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు.

ఎరువుల వినియోగంతో పర్యావరణానికి ముప్పు

నక్కపల్లి: వ్యవసాయంలో రసాయన ఎరువులు వినియోగంతో పర్యావరణానికి ముప్పు తప్పదని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ అన్నారు. శుక్రవారం నక్కపల్లిలో రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు సహజ వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. సేంద్రియ వ్యవసాయం చేపట్టడం మేలని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీఎం శ్రీనివాస్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది వెంకటలక్ష్మి, భవాని, ఆర్ఎస్‌కే సిబ్బంది, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రైతులకు అన్యాయం



చిక్కాల రామారావు

పాయకరావుపేట : అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, వ్యవసాయ సలహా మండలి జిల్లా మాజీ అధ్యక్షుడు చిక్కాల రామారావు ధ్వజమెత్తారు. బడ్జెట్‌లో రైతులకు అన్యాయం జరిగిందన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం పథకాలకు భారీగా కోత విధించారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పెన్షన్ వంటి హామీలకు పంగనామం పెట్టారన్నారు. బడ్జెట్ పట్ల రాష్ట్ర ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారన్నారు.

గ్రామాల పరిశుభ్రతకు కృషి చేయాలి



హరిపురంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జయమాధురి

రాంబిల్లి(యలమంచిలి): మండలంలోని గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాంబిల్లి ఎంపీడీవో బి.జయమాధురి కోరారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హరిపురంలో ఆమె పర్యటించారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ కార్యదర్శులకు, వివిధ గ్రామాల సర్పంచ్‌లకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరిపాలెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణపై పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తలను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఏవిధంగా అందజేయాలన్న దానిపై అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో వర్మీ కంపోస్ట్ ఏవిధంగా తయారు చేసుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బహిరంగ మల, మూత్ర విసర్జన చేయరాదన్నారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని నిర్మించుకోవాలని సూచించారు. ఇంటి సమీపంలో ఇంకుడు గుంతలు తవ్వించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సన్యాసిరాజు, హరిపురం పంచాయతీ కార్యదర్శి గంగరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా తడి, పొడి చెత్త సేకరణ

పాయకరావుపేట: తడి, పొడి చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో జయప్రకాష్‌రావు సూచించారు. పట్టణంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో శుక్రవారం అన్ని పంచాయతీ సెక్రటరీలు, క్లాప్ మిత్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్మీ కంపోస్టు తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి క్లాప్ మిత్రులకు అందించాలని ఎంపీడీవో ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ చంద్రశేఖర్, పీఎస్ఎస్ శివరాం, వై.సత్యనారాయణ, అప్పలాచారి, ఎస్‌వీజీఎం నాయుడు, టీవీ సత్యనారాయణ, కొండరావు, దుర్గాప్రసాద్, హైమావతి, నాగమని, రాజేశ్వరి, సుమతి, సునీత, 22 మంది పంచాయతీ కార్యదర్శులు, 78 క్లాప్ మిత్రులు పాల్గొన్నారు.